క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

తెనాలిఅర్బన్: ఆర్టీసీ అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఐదో రోజుకు చేరాయి. దీక్షల్లో సి.బాబూరావు, ఆర్.నాగమణి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్వీపీ బాబు, ఎస్.సుధాకర్, జె.వేణుగోపాల్, చిట్టిబాబు, వి.పాపారావు, నరసయ్య పాల్గొన్నారు.

సీనియర్ దైవజనులకు ఎమ్మెల్యే పరామర్శ

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన క్రిస్టియన్ మ్యారేజ్ రిజిస్ట్రార్, సీనియర్ దైవజనులు రెవ ఎస్.ఇమ్మానియేల్ దాస్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం పరామర్శించారు. దాస్ భార్య విమలాదాస్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఐతానగర్ ప్యాడిసన్‌పేటలోని స్వగృహం వద్ద ఉంచిన ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. డీఎంఆర్ స్కూల్ కరస్పాండెంట్‌గా, డబ్ల్యూఎంఈ సంస్థ ఏరియా డైరెక్టర్‌గా ఇమ్మానియేల్‌దాస్ దంపతులు అందించిన సేవలను గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్‌వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్ పాల్, బిషప్ కె.సుధీర్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి ఉన్నారు.

వివాహిత అదృశ్యం

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): వివాహిత అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం మల్లువాయి గ్రామానికి చెందిన పుల్లా మురళికి పదహారు సంవత్సరాల కిందట సూర్యాపేటకు చెందిన సుజాతతో వివాహమయ్యింది. వీరికి పాప, ఒక బాబు సంతానం. రెండేళ్ల కిందట వీరిద్దరూ పిల్లలతో కలిసి కూలి పనుల నిమిత్తం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, చినకొండ్రుపాడు గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా ఉన్న వెంకటరాజేష్ కోళ్ళ ఫారంలో పని చేసుకుంటూ, కంపెనీ క్వార్టర్స్ లోనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న సుజాత ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని గమనించిన భర్త మురళి ఆమెని మందలించాడు. మర్నాడు ఉదయం సుజాత ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. అదే రోజు నుంచి అదే కోళ్ళ ఫారంలో పని చేస్తున్న ఒరిస్సాకు చెందిన వరుణ్ తండి అనే వ్యక్తి కూడా కనిపించకపోవడంతో పాటు అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో వరుణే తన భార్య సుజాతని తీసుకొని వెళ్లి ఉండవచ్చని భర్త పుల్లా మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశమాంబకు ప్రత్యేక పూజలు

మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రావణ మాసంలో అమ్మవారికి జరిగే ఉత్సవాల్లో మొదటి ఆదివారం జరిగిన పూజల కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. దేశమాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియా ఆల్మాస్ ప్రతిభ



మంగళగిరి: షార్జా యూఏఈ వేదికగా జరిగిన ఫస్ట్ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా ఆల్మాస్ నాలుగు బంగారు పతకాలతో పాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ కైవసం చేసుకున్నట్లు కోచ్ ఎస్కే సంధానీ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన మొట్టమొదటి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అని పేర్కొన్నారు. ఆమె కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతోందని చెప్పారు. ఈ సందర్భంగా సాదియా ఆల్మాస్‌కు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ బి. ప్రసాద్, మంగళగిరి లిఫ్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్మాకుల విజయ భాస్కరరావు అభినందనలు తెలిపారు.

ఎన్జీవో మహా సభల్ని జయప్రదం చేయండి

మంగళగిరి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మంగళగిరి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, బాలనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగబ్రహ్మం ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహాసభల్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖ అధికారుల నుంచి ఇప్పటికే అనుమతి కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. మహాసభలకు హాజరయ్యే ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 157 జీవో ప్రకారం ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు.

మురుగు ముంచెత్తుతోంది..



చంద్రబాబునాయుడు కాలనీకి వెళ్ళే దారిలో నిలిచిన మురుగు నీరు



ఆర్ఆర్ నగర్‌లో ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు

- ఆర్ఆర్ నగర్‌లో రోడ్లపైనే వ్యర్థ నీరు
- ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు

తెనాలిఅర్బన్: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆనాలోచిత నిర్ణయాలతో కాలనీలను మురుగు ముంచెత్తుతోంది. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆ ప్రాంత వాసులు పలు మార్లు విన్నవించిన పట్టించుకునే వారు లేకుండాపోయారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తెనాలి మారీసుపేటలో డాక్టర్ రావి రవీంద్రనాథ్ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ సుమారు 36 సంవత్సరాల క్రితం ఏర్పాడ్డాయి. అక్కడ సుమారు రెండు వేల కుటుంబాలు నివసిస్తుంటారు. ఆ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు గతంలో నిర్మించి, మురుగును మాత్రం సమీపంలో ఉన్న పంట కాలువలో కలిసే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే వరదలు, విస్తార వర్షాలు పడినప్పుడు పంట కాలువల్లో నీటిని వదులుతుంటారు. అలాంటి సమయంలో నీరు ఎదురు తన్నటం వల్ల మురుగుంత రోడ్లపైకి చేరుతుంది.

ఏళ్ల గడుస్తున్న తీరని మురుగు కష్టాలు..

ఆర్ఆర్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీలలోని మురుగును బయటకు పంపే అవకాశం లేకపోవటంతో ప్రధాన మురుగు కాలువను పంట కాలువకు అనుసంధానం చేశారు. అయితే ఇరిగేషన్ కాలువలు ఎత్తులో ఉండటం... మురుగు కాలువలు పల్లంలో ఉండటం వలన పంట కాలువల్లో నీరును వదిలినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం వర్షాలు తరచుగా పడుతుండటంతో అధికారులు నీటిని కాలువల్లోకి వదులుతుంటారు. దీంతో ప్రధాన కాల్వలు అన్ని నీటి ప్రవాహంతో నిండిపోతున్నాయి. పంట కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల రెండు కాలనీలకు చెందిన మురుగు అక్కడే నిలచిపోతుంది. దీంతో రోడ్డుపైకి మురుగు వచ్చి చేరుతుంది. గతంలో మున్సిపల్ పాలకులు ఇలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు మోటార్లను ఏర్పాటు చేసి మురుగును బయటకు పంపే వారు. నేడు ఆ పరిస్థితి కనిపించకపోవటంతో ఆ కాలనీలు మురుగు మయంగా మారిపోయాయి. వెంటనే అధికారులు స్పందించి ఎన్నో ఏళ్ల నుంచి వేధిస్తున్న మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆప్రాంత వాసులు కోరుతున్నారు. అంతేకాకుండా ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు



కాలనీలో ఇళ్ల నుంచి వచ్చే మురుగును సమీపంలోని పంట కాలువకు గతంలో మళ్లించటం జరిగింది. పై నుంచి కాలువలకు నీరు వదలిన సమయంలో మురుగు కాలువలు పల్లంలో ఉండటం వలన నీరు ఎదురు తన్ని మురుగు పారుదల నిలిచిపోయింది. ఇటీవల స్థానికులు సమస్యను మా దృష్టికి తెచ్చారు. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

–ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి

స్థానిక ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సత్తా

- సానుభూతితోనే ఒక వార్డుకు, సర్పంచి పదవికి పోటీనే చేయలేదు
- కేవలం ఒక్క వార్డులోనే టీడీపీ స్వల్ప మెజారిటీతో గెలిచింది



సోమరాజు విజయలక్ష్మి



జాస్తి సౌమ్య

తెనాలి: స్థానిక సంస్థలకు జరిగిన ఉప ఎన్నికల్లో భాగంగా తెనాలి నియోజకవర్గంలో ఒక సర్పంచ్ పదవికి, నాలుగు వార్డు స్థానాలకు శనివారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. నాలుగు వార్డులకు గాను మూడు వార్డులు ఏకగ్రీవం కాగా, అందులో రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో 9వ వార్డుకు వైఎస్సార్ సీపీ మద్దతుదారు సోమరాజు విజయలక్ష్మి, పెదరావూరు గ్రామంలో 2వ వార్డులో జాస్తి సౌమ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గత పంచాయతీ ఎన్నికల్లో వల్లభాపురం పంచాయతీ ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. అప్పట్లో రాజీ ఒప్పందంలో భాగంగా వైఎస్సార్ సీపీ 10 వార్డులు తీసుకుని, టీడీపీకి 4 వార్డులు ఇచ్చారు. టీడీపీ నాలుగు వార్డుల్లో ఒక మెంబరు అయిన అవుతు శ్రీనివాసరెడ్డి చనిపోవటంతో ఉప ఎన్నిక జరిగింది. ఆ వార్డు టీడీపీదే కనుక, రాజీ ఒప్పందం ప్రకారం వైఎస్సార్ సీపీ నామినేషను దాఖలు చేయలేదు. దీంతో టీడీపీకి చెందిన కుర్రె శివరామిరెడ్డి ఏకగ్రీవం అయ్యారు. బుర్రిపాలెం సర్పంచి టీడీపీకి చెందిన పెమ్మసాని పురుషోత్తం. ఆయన చనిపోవటంతో ఉప ఎన్నిక జరిగింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అడుసుమల్లి అజయ్ నామినేషను దాఖలు చేశారు. గ్రామస్తులంతా వచ్చి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావును కలిశారు. సర్పంచి పదవిని ఈసారి ఏకగ్రీవంగా ఇవ్వాలని అభ్యర్థించారు. సానుభూతి కోసం, గ్రామంలో మంచి వాతావరణం కోసం అంగీకరించారు. పార్టీ అజయ్ నామినేషను ఉపసంహరించుకున్నారు. అయినా టీడీపీ అక్కడ ఏకగ్రీవంగా చేసుకోలేకపోయింది. ఆ పార్టీలోనే పోటీపడి నలుగురైదుగురు రంగంలో నిలిచారు. వారిలో ఒకరైన పరుచూరి విజయలక్ష్మి సర్పంచిగా గెలిచారు. వాస్తవానికి అక్కడ వైఎస్సార్ సీపీ పోటీ చేయలేదు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో బుర్రిపాలెం ఎంపీటీసీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గోపిశెట్టి రమాదేవి 45 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, ఆమెను రెండో వైస్ ఎంపీపీగా నియమించారు.

చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలి



చేనేత నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

మంగళగిరి: చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించి, కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని చేనేత రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం చేనేత నాయకులు చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు చేనేత సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు అనేక ఉద్యమాలు చేపట్టి తుది శ్వాస వరకు పోరాటం చేశారని కొనియాడారు. చేనేత సంఘాల నాయకులు వారిని ఆదర్శంగా తీసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తూరి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఎస్. బ్రహ్మేశ్వరరావు, డి. ఈశ్వరరావు, జె. జాన్‌బాబు, ఎ. ప్రభాకర్, జి. వెంకటకృష్ణ, బి. గిరి, ఆర్. అజయ్, జి. వెంకటేశ్వరరావు, ఎ. శ్రీనివాసమూర్తి, సీహెచ్. వెంకటేశ్వరరావు, వి. ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎన్. సుబ్రహ్మణ్యం, బి. నాగేంద్రం, జి. వెంకయ్య పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రియా చౌదరి

తాడేపల్లి రూరల్: సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి సాధ్యమని, దాన్ని విద్యార్థులంతా అలవరచుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ప్రియా చౌదరి సూచించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన మానసిక వికాస తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రత్యేకమైన లక్ష్యాల్ని ఏర్పరచుకుని తల్లిదండ్రులు ఆనందపడేలా జీవితంలో ఎదగాలని చెప్పారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె. రూతు రమ్య మాట్లాడుతూ కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి శివ కాంచనలత సహకారంతో విద్యార్థులకు మానసిక వికాసంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎఫ్‌ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, కో– ఆర్డినేటర్ శివగంగ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, పూర్వ విద్యార్థుల అసిస్టెంట్ డైరెక్టర్, మహిళా అభివృద్ధి సెల్ కో– కన్వీనర్ డాక్టర్ కె.సోని, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఆర్.కె.రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

మంగళగిరి: యర్రబాలెం సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం వేపచెట్టు సెంటర్‌కు చెందిన దానబోయిన నాగయ్య, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు అశోక్ (30) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మంగళగిరి నుంచి ఇంటిరి వస్తున్నాడు. మార్గంమధ్యలోని సినిమా హాల్ సెంటర్‌కు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీ గోడను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం అశోక్ మృతదేహాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య , పదేళ్ల కుమారుడు ఉన్నారు.

ప్రజాకవి గద్దర్ చిరస్మరణీయుడు

సంస్మరణ సభలో వక్తలు



గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న న్యాయవాదులు

తెనాలి: ప్రముఖ ప్రజాకవి, ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం స్థానిక అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధిస్ట్ సంస్థ అధ్యక్షుడు కంచర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, న్యాయవాదులు కంచర్ల చంద్రశేఖర్, కంచర్ల విజయభాస్కర్, గుమ్మడి రవిరాజు, రాజారాం , భేతాళ ప్రభాకర్, మట్ల మాణిక్యారావు, రవినాయక్, మస్తాన్, కుటుంబరావు, బెన్‌హర్, పీపీఆర్‌వీ సాగర్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడింది బంధువులే!

తెనాలిరూరల్: ఆస్తి కోసం దాడికి పాల్పడి బలవంతంగా సంతకాలు, వేలిముద్రలు తీసుకోవాలని చూసిన వారు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. పట్టణ గంగానమ్మపేటలోని నీలిశెట్టి వారి వీధికి చెందిన కొక్కెర చినతిరుపాలు ఇంటికి శనివారం తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తిరుపాలు, అతడి భార్య వెంకటరమణ, కుమారులపై దాడి చేసి బలవంతంగా ఆస్తి పత్రాలపై సంతకాలు, వేలిముద్రలు తీసుకునే ప్రయత్నం చేయగా, చుట్టుపక్కల వాళ్లు రావడంతో పరారైన సంగతి తెలిసిందే. వీరిలో ఒక యువకుడు స్థానికులకు చిక్కగా అతడిని నంద్యాలకు చెందిన అశోక్‌గా పోలీసులు గుర్తించిన వైనం విదితమే. చినతిరుపాలుకు దర్శిలోని బంధువులకు ఆస్తి వివాదం ఉంది ఈ నేపథ్యంలో అక్కడి బంధువులు, వారికి తెలిసిన వారే దాడికి పాల్పడి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. పోలీసుల అదుపులో ఉన్న అశోక్ కోసం ఇరువర్గాల బంధువులు వచ్చి పోలీసులను సంప్రదించారు. ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేయగా, మిగిలిన నిందితులూ లొంగిపోతామంటూ ఆదివారం రాయబారం పంపినట్లు సమాచారం.

మృతుడి ఆచూకీ గుర్తింపు

తెనాలిరూరల్: కాలువలో ఉన్న గుర్తు తెలియని మృతదేహం ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం తెనాలి మండలం పెదరావూరు చినపల్లె వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 17వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడి ఆచూకీని కనుగొన్నారు. మృతుడు పట్టణ ఇస్లాంపేటకు చెందిన డ్రైవర్ షేక్ కరిముల్లా(60)గా గుర్తించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి తెలిపారు.

వెంకటేశ్వర యోగి గురూజీకి అభినందనలు

మంగళగిరి: నగరానికి చెందిన శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పొందిన సందర్భంగా ఆదివారం నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వెంకటేశ్వర యోగికి పీహెచ్‌డీ రావడం పెద్ద విశేషం కాదని, పద్మశ్రీ రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. అవసరమైతే ఇందుకు తన వంతు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీ నిచ్చారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ సమాజానికి విలువలు నేర్పిన వ్యక్తిత్వాన్ని భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా వెంకటేశ్వర యోగి జీవిత చరిత్రను సమాజానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సత్కార గ్రహీత వెంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడుతూ నేడు ప్రపంచ ప్రజలందరినీ భాషలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు అతీతంగా ఏకం చేయగలిగినటువంటి ఏకైక విద్య యోగా విద్య మాత్రమే అన్నారు. ఇది తన పీహెచ్‌డీ ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సమర్పించిన గ్రంథ సారాంశమని వివరించారు.

గ్రామ సచివాలయాలతో మెరుగైన సేవలు

ఎమ్మెల్యే శివకుమార్



కఠెవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: గ్రామాల్లో ఏర్పాటు చేసే సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరంలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయం–1ను ఆదివారం ప్రారంభించారు. వివిధ గదులను జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, సర్పంచి బండికళ్ల ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకేలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంకురు బుజ్జిబాబు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, నాయకులు ఆదం షఫీ, మంచాల శ్రీనివాస్, మాదల శివన్నారాయణ, ఎల్.చినబాబు, షేక్ బుజ్జి, ముక్కాల మహేష్, బొనిగల సురేష్, తుల్లిమిల్లి సువర్ణ బాబు, శ్రీనివాసరెడ్డి, ఎరుకలపూడి సర్పంచి చందు శాంతికుమార్, పార్టీ కన్వీనర్ పి.సత్యనారాయణ, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్, సూరపనేని కల్పన పాల్గొన్నారు.

డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్‌కు ఘన నివాళి



సర్ రోనాల్డ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మలేరియా అధికారులు, సిబ్బంది.

తెనాలిఅర్బన్: ప్రపంచ దోమల దినోత్సవాన్ని స్థానిక కొత్తపేటలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మలేరియా వ్యాధిని గుర్తించిన బ్రిటీష్ వైద్యులు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ 1857 ఆగస్టు 20న బ్రిటీష్ వైద్యులు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ దోమకాటు ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని నిర్ధారించారని తెలిపారు. నీటి నిల్వలు దోమలకు ఆవాసాలని, అవి వృద్ధి చెందకుండా, వాటి బారిన పడకుండా ఉండటమే ప్రపంచ దోమల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం 1902 నోబుల్ బహుమతి అందించినట్లు చెప్పారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు స్వయం కృషి పురస్కారం



కోటేశ్వరరావును సన్మానిస్తున్న రమణరావు, శివశంకర్ తదితరులు.

తెనాలిఅర్బన్: సంప్రదాయ ఎముకల వైద్యుడు విష్ణుమొలకల కోటేశ్వరరావును మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషి పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సినీ హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణరావు, డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పొన్నం విజయ్ కుమార్, నాగినేని సురేష్ గోపి, పసుపులేటి రమాకాంత్, గోపిశెట్టి కృష్ణకాంత్, అన్నం రవి, కుంది వెంకట గిరి, గోపాలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ సభ్యులు

తెనాలి: ది తెనాలి ఫిజియోథెరపి అసోసియేషన్ తొలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం రాత్రి నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తొలి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంభం వెంకటకుమార్, ఉపాధ్యక్షురాలిగా ఆరాధ్యుల కృష్ణవేణి, కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా విజయసాగర్, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.అనిల్‌కుమార్ హాజరయ్యారు. సభలో డాక్టర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ ఫిజియోథెరపి అసోసియేషన్ ప్రారంభింటం శుభపరిణామంగా చెప్పారు. ఫిజియోథెరపి సేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. క్వాలిఫైడ్ వైద్యులతోనే ఫిజియోథెరపి సేవలను అందుకోవాలని నూతన అధ్యక్షుడు వెంకటకుమార్ కోరారు. ఫిజియోథెరపిస్టులు సందీప్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ శరత్‌బిందు పాల్గొన్నారు.

జానపద కళలను ప్రోత్సహించాలి



సదస్సులో పాల్గొన్న తెనాలి కళారంగ ప్రముఖులు

తెనాలి: అంతర్జాతీయ జానపద కళా విర్భావ దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ హాలులో నిర్వహించిన సభకు విద్యా కో–ఆర్డినేటర్ సీహెచ్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. కన్వీనర్ బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ, జానపద కళారూపాల ఇష్టాగోష్ఠి సోమ, మంగళవారాల్లోనూ జరుగుతుందని తెలియజేశారు. జానపద కళలు అంతరించి పోకుండా చూడాలని లక్కరాజు లక్ష్మణరావు సూచించారు. కోలాటం, చెక్కభజన గురువు సనకా ప్రసాద్ ఆయా కళల ప్రాముఖ్యతను వివరించారు. సాహిత్యం, జానపద విశ్లేషకుడు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి మాట్లాడుతూ జానపద కళలను ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. 'ఉత్తమ ఉపాధ్యాయుడు' ఎంవీ రఘునాథరావు, హరికథా భాగవతారిణి బెజ్జంకి నాగమణి, వీల్మీకి విజయలక్ష్మి, శారదా చలపతి, జ్యోతి, శివకుమారి, విజయదుర్గ, సర్దెన శ్రీనివాసరావు, యర్రం అప్పారావు మాట్లాడారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్మే వ్యక్తిని, కొనుగోలు చేసే వ్యక్తిని యస్‌ఐ రమేష్ ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. హైదరాబాద్ బండ్లగూడకు చెందిన మహమ్మద్ ఉస్మాన్ పాషా (ఆలీ) బతుకు తెరువు నిమిత్తం మంగళగిరి రూరల్ యర్రబాలెంలో నివాసముంటూ, మంగళగిరి పట్టణ పరిధిలో బేకరీ పని చేస్తున్నాడు. ఇతడికి తాడేపల్లి కొత్తూరుకు చెందిన శివయ్య మద్యం తాగేటప్పుడు పరిచయం అయ్యాడు. డబ్బులు లేకపోవడంతో గంజాయికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే ఉస్మాన్ పాషాకు కూడా అలవాటు అయ్యింది. ఇటీవల అతడు యర్రబాలెంలోని స్నేహితుడు యాసిన్ వద్ద ద్విచక్ర వాహనం తీసుకువెళ్లి పాడేరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి, శివయ్యకు ఇచ్చాడు. కృష్ణనగర్ శివారు ప్రాంతంలోని శ్మశానం వద్ద శివయ్య అమ్ముతుండగా సీఐ శేషగిరిరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా ద్విచక్ర వాహనంలో గంజాయితో పాటు శివయ్య దగ్గర చిన్న పొట్లాలు దొరికినట్లు యస్‌ఐ రమేష్ తెలిపారు. ఉస్మాన్ పాషా వద్ద గంజాయిని అమ్మేందుకు ఉపయోగించే కాటా లభించిందన్నారు. ఇద్దరి వద్దా 1200 గ్రాముల గంజాయి లభించడంతో వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.